
www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 29 సెప్టెంబర్ 2023





గుండె వ్యాధుల నివారణపై అవగాహన


మాట్లాడుతున్న డాక్టర్ భక్తవత్సలరెడ్డి

నెల్లూరు :వ్యాయామం, మంచి జీవనశైలి ద్వారా గుండె సంబంధిత సమస్యలకు దూరంగా ఉండవచ్చని అపోలోహాస్పిటల్ సీనియర్ ఇంటర్ వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ చిర్రా భక్తవత్సల రెడ్డి పేర్కొన్నారు. 29న వరల్డ్ హార్ట్ డే ని పురస్కరించుకొని అపోలో ఆస్పత్రిలో కన్సల్ టెంట్ కార్డియో తొరాసిక్ వాస్కులర్ సర్జన్ డాక్టర్ ఎస్. విజ్ఞ చరణ్, హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాం సతీష్‌తో కలిసి విలేకర్లతో మాట్లాడారు. డాక్టర్ చిర్రా భక్తవత్సలరెడ్డి మాట్లాడారు. ఆహారంలో ఆకుకూరలు, చిరుధాన్యాలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. రోజు కనీసం 7 గంటలు నిద్రపోవాలన్నారు. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా అపోలో హాస్పిటల్ లో బిపి, షుగర్, ఈసిజి పరీక్షలను ఉచితంగా చేస్తున్నట్లు తెలిపారు. మరోవైపు వరల్డ్ హార్ట్ డే ను పురస్కరించుకుని నగరంలోని టౌన్ హాల్లో అపోలో హాస్పిటల్ సీనియర్ ఇంటర్ వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ చిర్రా భక్తవత్సల రెడ్డి ప్రజల కోసం అవగాహన సదస్సును నిర్వహించారు. ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

ఆరోగ్య శ్రీ నత్తనడక..!

పేద ప్రజలకు ఆరోగ్య భరోసా ఇస్తున్న ఆరోగ్యశ్రీ పథకం రోజు రోజుకు వెనుకబడుతోంది. ప్రభుత్వం మాటలు కోటలు దాటుతుంటే.. ఆచరణ మాత్రం గడప దాటడం లేదు.. పేదలకు వెయ్యి రోజులు బిల్లు దాటితే ఆరోగ్యశ్రీ కింద చూస్తామని చెబుతుంటే ఆరోగ్యశ్రీ పథకం కింద సేవలందించే ఆస్పత్రులే కనిపించడం లేదు. 2007లో పేద ప్రజలకు భరోసా కల్పించిన ఈ పథకం ఎందుకు ఉపయోగపడడంలేదు. ఈ పథకం అమలు నుంచి కార్పొరేట్ ఆస్పత్రులు బిల్లులు రావడం లేదని వెళ్లిపోయాయి. ఉన్న ఆస్పత్రులు పూర్తి స్థాయిలో సేవలు అందించ చడానికి ముందుకు రావడం లేదు. నగదు సరిపోవడం లేదని, నగదు సరిగా రావడం లేదని పలు రకాల సేవలను నిలిపేశారు. 3,257 సేవలందిస్తున్నామనే గొప్పలు తప్ప పెద్దగా ఉపయోగపడడం లేదు.

- ◆ఇప్పటికే వెనక్కి వెళ్లిన ఆస్పత్రులు
- ◆సేవల నుంచి ఆస్పత్రులు దూరం
- ◆సామాన్యుడికి ఇబ్బందులు
- ◆మాటలు కోటలు దాటుతున్నా..ఆచరణ..!

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

నిరుపేద ప్రజలకు మరి వైద్యం అందించాలనే ఉద్దేశంతో 2007లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టారు. ఉచితంగా బిపిఎల్ కింద ఉన్న పేదలకు, తెల్లరేషన్ కార్డుదారులకు, జర్నలిస్టుల హెల్త్ స్కీమ్ , ఇహెచ్ఎస్ స్కీమ్‌ల ద్వారా సేవలందించారు. అప్పట్లో ఆపరేషన్లు ఆరోగ్యశ్రీ పథకం కింద చేపట్టారు. రాష్ట్ర వ్యాపితంగా ఏడాదికి రూ.3500 కోట్లు ఈ పథకం కోసం ఖర్చుచేస్తే, జిల్లాలో సుమారు రూ.350 నుంచి రూ.400 కోట్లు ఖర్చు చేసేవారు. నగరంలోని ప్రముఖ ఆసుపత్రులు ఈ పథకాన్ని అమలు చేశాయి. బొల్లినేని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, సింహపురి, నారాయణ ఆసుపత్రి, అపోలో సూపర్ స్పెషాలిటీ వంటి కార్పొరేట్ ఆసుపత్రులతోపాటు, నగరంలోని అనేక ఆసుపత్రులు ఈ స్కీమ్ ద్వారా సేవలు అందించ చాయి. నిధులు అటు, ఇటుగా విడుదల కావడంతో సేవలందించారు. ఐబీవల కాలంలో వైద్యసేవల సంఖ్య భారీగా పెంచారు. ఆసుపత్రులకు ఆపరే షన్లకు అతితక్కువ నగదు మంజూరు చేయడం ,అది కూడా సకాలంలో ఇవ్వక పోవడంతో నగరం లోని ప్రముఖ ఆసుపత్రులు ఆరోగ్య శ్రీ నుంచి వెళ్లి పోయాయి. అపోలో, బొల్లినేనితోపాటు పలు ఆసు పత్రులు ఈ సేవల నుండి తప్పు కున్నాయి. నారాయణ ఆసుపత్రి, మెడికవర్ కార్పొరేట్ ఆసుపత్రులు మాత్రమే ఆరోగ్యశ్రీ కింద సేవలందిస్తున్నారు. స్థానిక ఆస్పత్రులు కొన్ని



మాత్రమే ఆరోగ్యశ్రీ సేవలందిస్తు న్నాయి. కార్పొరేట్ ఆస్పత్రులు ఆరోగ్య శ్రీ విషయంలో అనేక అక్రమాలకు పాల్పడుతున్నాయి. ఉచిత సేవలని వెతుతోన్న రోగులకు వివిధ రకాల కారణాలు చెప్పి బిల్లులు వసూళ్లు చేస్తున్నారు.

ఆరోగ్యశ్రీ నత్తనడక..

ఆరోగ్యశ్రీ పథకం ప్రభుత్వ విధానాల వల్ల నత్తనడక నడుస్తోంది. గతంలో ఈ పథకం కింద 2446 వ్యాధులను చేర్చారు. ఆయా విభాగాలకు చికిత్స చేస్తే నగదు ఇంతే చెల్లిస్తామని ప్రకటించారు. అటు, ఇటుగా నిధులు మంజూరు చేసే పరిస్థితి తలెత్తింది. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా వచ్చిన తరువాత ఆరోగ్య శ్రీ విషయంలో ఆర్భాటం చేశారు. వెయ్యి రూపాయలు బిల్లు తరువాత అన్ని కేసులను ఆరోగ్యశ్రీ కింద చికిత్స చేస్తామని గొప్పలు చెప్పారు. అప్పటికే ఉన్న 2446 జబ్బులకు 811 కలిపి మొత్తం 3257 వ్యాధులను ఆరోగ్య శ్రీ కింద చేర్చారు. ఈ నిర్ణయంతో పేద ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ప్రభుత్వ మాటలు కోటలు దాటితే ఆచరణ గడప దాటడంలేదు. అప్పటికే ఆరోగ్యశ్రీ కింద జిల్లాలో సేవలందిస్తున్న ఆస్పత్రులు మేం చేయలేమంటూ వెళ్లిపోయాయి. నెల్లూరులో నారాయణ ఆసుపత్రి ఒక్కటే ఆరోగ్య శ్రీ హెల్త్ కేర్ ఆసుపత్రిగా కొనసాగుతోంది. మెడికవర్ కూడా ఆరోగ్య శ్రీ సేవలు చేస్తుంది. ప్రభుత్వం చెబుతోన్న జబ్బులకు ఆసుపత్రులు చికిత్స చేయడం లేదు. ఆరోగ్యశ్రీ స్కీమ్ నుంచి కొన్ని ఆస్పత్రులు వెళ్లిపోయాయి. ఉన్న ఆస్పత్రులు ముఖ్యమైన సేవల నుంచి తప్పుకుంటున్నాయి. నగరంలోని మెడికవర్ ఆస్పత్రిలో యూరాలజీతోపాటు పలు సేవలను నిలిపేశారు. ప్రభుత్వం చెబుతున్న దానికి ఇక్కడ అమలు జరుగుతోన్న పరిస్థితులకు సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అప్పులు చేసుకొని ప్రయివేటు ఆసుపత్రుల్లో వైద్య సేవలందుకుంటున్నారు. ప్రభుత్వం ఆరోగ్యశ్రీ విషయంలో చొరవ చూపించి, రోగులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.


కెవిపిఎస్ ఆధ్వర్యంలో జాషువా చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

జాషువాకు ఘన నివాళి

నెల్లూరు :కవి గుర్రం జాషువా 128వ జయంతి సందర్భంగా కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) ఆధ్వర్యంలో నగరంలోని సిపిఎం కార్యాలయంలో జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సాహితీ స్రవంతి జిల్లా కార్యదర్శి పి గోవిందు మాట్లాడారు. జాషువా చిన్నతనం లో ఎన్నో అవమానాలను భరించి సమా ధానంగా తన కలాన్ని ఆయుధంగా చేసుకుని కవిత్వం ద్వారా కుల వివక్షకు అంటరా నితనానికి వ్యతిరేకంగా పోరాడిన గొప్ప సామాజిక సంస్కర్త అని కొనియాడారు. కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నేలపాటి రఘురామయ్య, ఆలూరి తిరుపాలు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలి.వెంగయ్య, సీనియర్ నాయకులు చండ్ర రాజగోపాల్, పి. శ్రీరాములు ఎం సింహగిరి, డప్పు కళాకారుల సంఘం జిల్లా కార్యదర్శి తల్లు.శీనయ్య, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీస్ మానిటరింగ్ జిల్లా కమిటీ సభ్యులు శేషం సుదర్శన్ ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి గండవరం శేషయ్య, నాయకులు దాల్ శ్రీధర్, కెవిపిఎస్ నాయకులు పార్ని చర్ల శ్రీనివాసులు, సిహెచ్ శ్రీరాములు, ఎస్ చలపతి, మొద్దు సీనయ్య పాల్గొన్నారు.

కందుకూరు : కందుకూరు పట్టణ వైసిపి కార్యాలయంలో గుర్రం జాషువా 128వ జయంతి వేడుకలు గురువారం నిర్వహించారు. ఎంఎల్ఎ మానుగుంట మహీధర్ రెడ్డి గుర్రం జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎఎంసి చైర్మన్ తోకల కొండయ్య వైసిపి పట్టణ అధ్యక్షులు ఎస్‌కె రఫీ, రమేశ్, అయ్యన్న, మహేష్ పాల్గొన్నారు.

టిడిపి కార్యాలయంలో : కందుకూరు నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో గుర్రం జాషువా 128 వ జయంతి వేడుకలు గురువారం నిర్వహించారు. ఆ పార్టీ ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వర రావు రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగి సూరపోగు ఏసుదాసు, ఎస్సీ సెల్ కార్యనిర్వాహ కార్యదర్శి చదలవాడ కొండయ్య, నెల్లూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి గోచిపాతల మోషేఉన్నారు.

పోర్టు పనుల ప్రగతి భేష్..!

పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజు


పోర్టులో మౌలిక వసతులపై సమీక్షిస్తున్న యువరాజు

ప్రజాశక్తి-గుడ్లూరు -కందుకూరు

రామాయపట్నం పోర్టు పనులు వేగంగా జరుగుతున్నాయని, పోర్టు పనుల ప్రగతి బాగుందని రాష్ట్ర పరిశ్రమలు వాణిజ్య శాఖ కార్యదర్శి ఎన్ యువరాజ్ అన్నారు. గురువారం ఆయన రామాయపట్నం పోర్ట్ ప్రగతిని జిల్లా కలెక్టర్ ఎం హరి నారాయణన్‌తో కలిసి సమీక్ష చేశారు. అనంతరం పోర్టులో జరుగుతున్న మొదటి బెర్త్ నిర్మాణ పనులను కలెక్టర్, పోర్టు ఎమ్‌డి ప్రతాప రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజు మాట్లాడుతూ మొదటి ఓడ పోర్ట్ లోనికి రావడానికి వీలుగా డ్రెడ్జింగ్ , బెర్త్ నిర్మాణంతోపాటు అన్ని మౌలిక సదుపాయాలు డిసెంబర్ నాటికి పూర్తిచేయాలని సూచించారు. పోర్ట్ పరిసర ప్రాంతాల భౌగోళిక స్థితి పై ఆరాతీశారు.మాస్టర్ ప్లాన్ ,మాప్ లను పరిశీలించారు. కందుకూరు సబ్ కలెక్టర్ సోభిక, అర్‌పిడిసియల్ అధికారులు పోర్ట్ ఎండీ ప్రతాప్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, పద్మావతి పోర్టు అధికారులు సుధాకర రావు,శేషుబాబు, జెడి ఇండస్ట్రీస్ సుధాకర్ ఉన్నారు.

మేలు జాతి పశువులతో పాడి పరిశ్రమకు లాభం



పోర్టులో మౌలిక వసతులపై సమీక్షిస్తున్న యువరాజు

ప్రజాశక్తి-నెల్లూరు : మేలు జాతి పశువుల అభివృద్ధితోనే పాడి పరిశ్రమ లాభదాయకం ఉంటుందని, ఈ నేపథ్యంలో లింగ నిర్ధారిత వీర్యంతో పెయ్యదూడలు పుట్టే విధానం అమల్లోకి తీసుకొచ్చినట్లు పశు గణాభివృద్ధి సంస్థ రాష్ట్ర చైర్మన్ గొల్లపల్లి విజయకుమార్ అన్నారు. గురువారం నగరంలోని వెటర్నరీ పాలీ క్లీనిక్ క్యాంపులో పాడి రైతులకు– జాతీయ లైవ్ స్టాక్ మిషన్ ద్వారా లింగ నిర్ధారిత 'వీర్యము.. ప్రయోజనాలు, ఏడాదికి ఒక పెయ్యదూడ' పొందడం అన్న అంశంపై ఒక్క రోజు శిక్షణ, అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న విజయకుమార్ మాట్లా డుతూ రైతులు ప్రతి ఏడాది మేలైన యాజమాన్య పద్ధతులను పాటించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని పిలుపు నిచ్చారు. జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డాక్టర్ వి.కోటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రీయ గోకుల మిషన్ సౌజన్యంతో పెయ్య దూడల ఉత్పత్తి పథకం అమలు చేస్తున్నామన్నారు. అనంతరం పశు సంవర్ధక శాఖ కార్యనిర్వహణ అధికారి డాక్టర్ టి.సోమయ్య 'లింగ నిర్ధారిత వీర్యం' అన్న అంశంపై పవర్‌పాయింట్ ద్వారా రైతులకు పూర్తి శిక్షణా అవగాహన కల్పించారు. లేగ దూడుల పెంపకంపై డాక్టర్ ఎస్.జయచంద్ర, ఏడాదికి ఒక దూడ పొందడంపై డాక్టర్ ఆర్.వసంతలు రైతాంగానికి అవగాహన కల్పించారు. నెల్లూరు డివిజన్ ఉపసంచాలకులు డాక్టర్ ఎం.నాగమణి, బి.మల్లికార్జున, డాక్టర్ రమేష్‌నాయక్ ఉన్నారు.


మాట్లాడుతున్న నాయకులు

గిరిజనులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలి

ప్రజాశక్తి-నెల్లూరు : యానదులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించే వరకు తమ పోరాటం సాగుతుందని యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర ధ్యక్షుడు కేసి పెంచలయ్య పేర్కొన్నారు. గురువారం నగరంలోని స్థానిక జెట్టి శేషారెడ్డి భవనంలో యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశంను నిర్వహించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల ప్రతినిధులు పాల్గొని పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు కెసి పెంచలయ్య మాట్లాడుతూ యానాదులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించే వరకు గిరిజనులందరూ ఐక్యంగా పోరాట బాట పట్టాలన్నారు. జనవరిలో యానాదుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాజకీయ పార్టీలకు కళ్ళు తెరిపించేలా నెల్లూరు నగరంలో ధూమ్ ధామ్ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామన్నారు. నగర మేయర్ పోతులూరి స్రవంతి మాట్లాడుతూ గిరిజనుల సంక్షేమం కోసం తన వంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళ్యాణ చక్రవర్తి, వెంకట సుబ్బయ్య, చేవూరు సుబ్బారావు, తలపల జయ వర్ధన్ రాష్ట్రం నుంచి అధిక సంఖ్యలో అన్ని జిల్లాల ప్రతినిధులు మహిళలు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ముస్లిములకు 'ఇంటూరి' శుభాకాంక్షలు

ప్రజాశక్తి-కందుకూరు : ఈద్-ఏ-మిలాద్-ఉన్-నబీ సందర్భంగా పట్టణ ముస్లిం నాయకులకు కందుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు శుభాకాంక్షలు తెలిపారు. నాగేశ్వరావు మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త జీవితం ప్రేమ, సౌభ్రాతత్వం , ధర్మంతో కూడినని పేర్కొన్నారు. మానవాళికి ఎంతో స్ఫూర్తిదాయకమైనని ఆయన పేర్కొన్నారు. ముస్లిం పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ సలాం, నాయకులు షేక్ మున్నా, షేక్ ఫిరోజ్, రూబీ, నజీర్, గౌస్ బాషా, అహ్మద్ భాష, జిలాని, కరిముల్లా, మా బాషా ఉన్నారు.

3న పాలిటెక్నిక్ స్పాట్ అడ్మిషన్లు

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు పాలిటెక్నిక్‌లో మొదటి సంవత్సరం మిగిలి ఉన్న ఎలక్ట్రానిక్, సివిల్ డిప్లమా సీట్లకు అక్టోబర్ మూడున స్పాట్ అడ్మిషన్లు జరుగు తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె మస్తానయ్య తెలిపారు. 10వ తరగతి పాస్ అయిన, పాలిసెట్ 2023 ప్రవేశ పరీక్ష రాసిన, రాయని విద్యార్థులు తమ దరఖాస్తులను ఫోటో ఒరిజినల్ ,జిరాక్స్ సర్టిఫికెట్లతో మూడో తేదీ ఉదయం 9 గంటలకు కందుకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో విద్యార్థిని విద్యార్థులు హాజరు కావాలని కోరారు. స్పాట్లో సీటు లభించిన విద్యార్థులు రూ 6000 కళాశాలకు వివిధ ఫీజుల నిమిత్తం చెల్లించాలని ఆయన కోరారు. స్పాట్ అడ్మిషన్ లో సీటు పొందిన వారికి ఎలాంటి స్కాలర్షిప్ పొందేందుకు అర్హత ఉండదని ప్రిన్సిపాల్ తెలిపారు.

ఆహార ప్యాకెట్లు పంపిణీ

ప్రజాశక్తి-కందుకూరు :ఆకలికి అందరూ బంధువులే అనే నినాదంతో ఐ.ఎఫ్.సి ఫౌండేషన్ కందుకూరు వారి ఆధ్వర్యంలో గురువారం దాతల సహాయంతో పేదవారికోసం కందుకూరులో నిస్సహాయులైన వారిని గుర్తించి వారికి భోజనాల ప్యాకెట్లు అందించారు. ప్రతి ఒక్కరు తమ సామాజిక బాధ్యతగా పేదవారికి సహాయం అందిస్తే సమాజానికి ఎంతో మేలు జరుగుతుంది అని ఫౌండేషన్ సెక్రెటరీ షంషేర్ అన్నారు. ప్రెసిడెంట్ సాజిద్,ట్రెజరర్ హఫీజ్,ఇంచార్జ్ అయూబ్ ఖాన్ పఠాన్, షంషఉద్దీన్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

ప్రజాశక్తి-గుడ్లూరు :రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో నలుగురికి గాయాలైన సంఘటన గుడ్లూరు సమీపంలోని అడవిరా జూపాలెం పోయే రహదారిలో గురువారం చోటుచేసుకుంది. గాయపడిన వారిని గుడ్లూరు లో ఉన్న ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స కోసం చేర్పించారు. అమ్మవారిపాలెం గ్రామానికి చెందిన మల్లికార్జున ద్విచక్ర వాహనంపై బాలయ్య అనే వ్యక్తిని ఎక్కించుకొని గుడ్లూరు వస్తూ ఉండగా గుడ్లూరు నుంచి అడవి రాజుపాలెం ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఎలీషా, పిచ్చయ్య ద్విచక్ర వాహనాన్ని ఎదురు ఎదురుగా ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. మెరుగైన వైద్యం కోసం కావలి ప్రభుత్వ వైద్యశాలకి తరలించారు.

ఉద్యోగ,ఉపాధ్యాయులను మోసగించిన ప్రభుత్వం

యుటిఎఫ్ ఆధ్వర్యంలో 'జిపిఎస్' బిల్లు ప్రతులు దగ్ధం

ప్రజాశక్తి-నెల్లూరు :ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆకాంక్షలకు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం జిపిఎస్ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదించడం దుర్మార్గమైన చర్య అని యుటిఎఫ్ జిల్లా కమిటీ విమర్శించారు. గురువారం వైసిపి ప్రభుత్వం జిపిఎస్ బిల్లును ఆమోదించడాన్ని వ్యతిరేకిస్తూ యూటిఎఫ్ ఆధ్వర్యంలో అన్నమయ్య సర్కిల్ ఎదుట నిరసన చేపట్టారు యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.నవకోటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సిపిఎస్ విధానం రద్దు చేసి ఓపిఎస్ విధానం అమలు చేస్తామంటూ హామీలు ఇచ్చి నాలుగున్నరేళ్ల తర్వాత చేసిన హామీలకు విరుద్ధంగా జిపిఎస్ విధానం అమలు చేస్తు నిర్ణయం తీసుకొని ఉద్యోగ, ఉపాధ్యాయులను మోసం చేశారన్నారు. జిపిఎస్, సిపిఎస్ విధానాలు వద్దని, ఓపిఎస్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేస్తు ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆందోళనలు చేస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యధోరణగా వ్యవహరిస్తూ జిపిఎస్ బిల్లుకు ఆమోదం తెలపడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి, అధ్యక్షులు చలపతి శర్మ, వి.విశేషులు మాట్లాడుతూ గ్యారెంటీ లేని పెన్షన్ స్కీంను ఆమోదించి ఉద్యోగ , ఉపాధ్యాయులను ఈ ప్రభుత్వం వంచిం చిందన్నారు. చివరగా జిపిఎస్ ప్రతులను దగ్ధం చేశారు. యుటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎం.సి అచ్చయ్య, కోశాధికారి ఎ.మురళీదర్‌రావు, జిల్లా కార్యదర్శులు ఎన్. సురేంద్రబాబు, కె.నాగిరెడ్డి, బాలరాఘవయ్య, మండల అధ్యక్ష, కార్యదర్శులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


కందుకూరులో..

ప్రజాశక్తి-కందుకూరు :జిపిఎస్ బిల్లును ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకిస్తూ యుటిఎఫ్ నిరసనను తెలియజేసింది. బిల్లు తాలూకు ప్రతులను కందుకూరులోని పోస్ట్ ఆఫీస్ సెంటర్ వద్దగురువారం దహనం చేశారు. ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు నేటి ముఖ్యమంత్రి అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సిపిఎస్ విధానాన్ని రద్దు చేస్తానని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన నాలుగున్నర సంవత్సరాల తర్వాత సిపిఎస్ స్థానంలో పాత పెన్షన్ విధానాన్ని కాదని గ్యారెంటీ పెన్షన్ స్కీముని ప్రవేశపెట్టటాన్ని ఉద్యోగులు నిరసించారు. యుటిఎఫ్ సీనియర్ నాయకులు ముప్పరాజు కోటేశ్వరరావు మాట్లా డుతూ ఒక్క రోజు అయిన చట్ట సభకు ఎన్నికైన ప్రజాప్రతినిధులకు పాత పెన్షన్ విధానాన్ని మరి జీవితకాలం సేవ చేసిన ఉద్యోగ ఉపాధ్యాయులకు గ్యారెంటీ పెన్షన్ స్కీమ్ ఏమిటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసే వరకు అన్ని ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలతో కలిసి ప్రభుత్వంపై పోరాడుతామని తెలిపారు.కందుకూరు నియోజకవర్గంలోని అన్ని మండలాల యుటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మరియు పొన్నలూరు మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.


నెల్లూరులో ..

చంద్రబాబును విమర్శించే స్థాయి 'తూమాటి'కి లేదు..

ప్రజాశక్తి-కందుకూరు

మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో అవినీతి జరిగిందని జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆరోపణలు చేస్తూ అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు కందుకూరు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు డాక్టర్ దివి శివరాం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎల్ఎ తుమాటి మాధవరావు శాసనమండలిలో మాట్లాడుతూ చంద్ర బాబు నాయుడు అవినీతికి పాల్పడ్డారని మాట్లాడటం సిగ్గుమాలిన చర్యగా శివరాం అభివర్ణించారు. తుమాటి మాధవరావు నోరు అదుపులో పెట్టుకోవాలని లేనిపక్షంలో కందుకూరు నియోజ కవర్గం ప్రజలు తగినగుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

'తూమాటి' వ్యాఖ్యలు అర్థరహితం

:ఎపిలో డిగ్రీ, పీజీ కోర్సులు పూర్తిచేసిన నిరుద్యోగ యువతీ యువకులకు స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా శిక్షణ ఇచ్చి వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించి వారి జీవితాలలో వెలుగులు నింపితే ఓర్చుకోలేని ఎంఎల్సి తుమాటి మాధవరావు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై అర్థరహితమైన ఆరోపణలు చేయడం శోచనీయమని నెల్లూరు పార్లమెంటు టిడిపి అధికార ప్రతినిధి గోచిపాతల మోషే పేర్కొన్నారు.

చంద్రబాబుకు మద్దతుగా టిడిపి వినూత్న నిరసన


నెల్లూరులో..

ప్రజాశక్తి నెల్లూరు సిటీ

అవినీతిపరుడైన వైయస్ జగన్ సీఎం పదవికి అనర్హుడని చేతకాని పాలనలో రాష్ట్రం తిరోగమనం పట్టిందని నాలుగు నెలల్లో ప్రజలు ఇంటికి పంపించేందుకు సిద్ధంగా ఉన్నారని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అరెస్టుకు వ్యతిరేకంగా మాజీ మంత్రి పొంగూరు నారాయణ ఆదేశాల మేరకు కోటంరెడ్డి ఆధ్వర్యంలో నెల్లూరు విఆర్సి సెంటర్ నుంచి గాంధీ బొమ్మ సెంటర్ వరకు గురువారం వెనక్కి నడుస్తూ వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయంగా ఎదుర్కొనే దమ్ము లేక అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారు. టిడిపి నేతలతో కలిసి స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లో సందర్శించామని అక్కడ ఎలాంటి అవినీతి కనిపించలేదన్నారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబును రాజకీయంగా ఎదుర్కొనే దమ్ము లేకనే జగన్ ఇలాంటి నీచమైన చర్యలకు పాల్పడుతున్నారన్నారు. త్వరలోనే కడిగిన ముత్యంలా బయటికి వస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. మాజీ జెడ్పిటిసి ఎం విజేతారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ అనురాధ తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు : టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా కందుకూరులోని టిడిపి కార్యాలయం వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 16వ కొనసాగాయి. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో దీక్షలకు హాజరయ్యారు. దీక్షలకు హాజరైన కందుకూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడారు. అమరావతి రింగ్ రోడ్డు వ్యవహారంలో నారా లోకేష్‌ని ఇరికించేందుకు జగన్మోహన్ రెడ్డి మరో కుట్ర చేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబుకి సంఘీభావంగా ప్రతి కుటుంబం నుంచి రోడ్లపైకి వస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో దీని ప్రభావం తీవ్రంగా ఉంటుందని అన్నారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, నియోజకవర్గ అధ్యక్షుడు నాదెళ్ల వెంకట సుబ్బా రావు, నెల్లూరు పార్లమెంట్ అధికారి ప్రతినిధి గోచిపాతల మోషే, నాయకులు ఉమ్మనేని సుబ్బారావు, రావుల రవి, ముచ్చు వేణు, కన్నా ప్రసాద్, బైరపనేని రమణయ్య, శివరామయ్య, సాదు చెన్నకేశవులు, వేణు, నరాల మాలకొండ రెడ్డి, మల్లికార్జున్ రెడ్డి, రామచంద్ర రెడ్డి వెంకటేశ్వర్లు, కామినేని ప్రసాద్, ముళ్ళపాటి మహేష్, చుండూరి శీను, మచ్చ మనోహర్, గుమ్మా శివ, దాసరి ప్రమోద గేరా నరేష్, చుంచు శ్రీనివాసులు, బక్కమంతల మాల్యాద్రి ఉన్నారు.



కందుకూరులో..

తహశీల్దార్ కార్యాలయంలో షార్ట్ సర్క్యూట్

నెల్లూరు :నగరంలోని రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న తహశీల్దార్ కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం విద్యుత్తు షార్టు సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో కార్యాలయంలోని రికార్డులు, ఫైల్స్ అగ్నికి ఆహుతైయ్యాయి. ఈ ఘటన చోటు చేసుకున్న వెంటనే తహశీల్దార్ అగ్నిమాపక కార్యాలయానికి సమాచారం అందజేశారు. ఫైర్ సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు.

రోగులకు పండ్లు పంపిణీ

నెల్లూరు :స్వాతంత్ర సమరయోధులు భగత్ సింగ్ 116వ జయంతి సందర్భంగా ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ హాస్పిటల్లో కాన్పుల వార్డు లోనీ మహిళలకు బ్రెడ్స్,ఫ్రూట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిపిఐ నగర సహాయ కార్యదర్శి సయ్యద్ సిరాజ్, ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ మున్నా మాట్లాడుతూ స్వతంత్ర పోరాటంలో అతి చిన్న వయసులో దేశం కోసం ప్రాణాలర్పించిన మహోన్నత వ్యక్తి భగత్ సింగ్ అని కొనియాడారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు షానవాజ్, ఏఐవైఎఫ్ నగర అధ్యక్ష కార్యదర్శులు గౌస్, మధు, బాదుల్లా, అల్తాఫ్, ఉమర్, సుభాని పాల్గొన్నారు.


ఉలవపాడులో..

ఉలవపాడు :మిలాద్ ఉన్ నబి మహమ్మద్ ప్రవక్త పుట్టినరోజు సంద ర్భంగా గురువారం నాడు ఉలవపాడు లోని రిజరుకాలనీ మసీదులో మౌలా నా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. స్థానిక సి.హెచ్ సి వైద్యశాల, శ్రీశ్రీ ప్రజా వైద్యశాలలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. డాక్టర్ మాదాసి వెంకయ్య ,డాక్టర్ ఐశ్వర్య, మసీదు పెద్దలు, నేతలు పాల్గొన్నారు. మసీదు కమిటీ సభ్యులు సయ్యద్ దస్తగిరి బాషా, సుల్తాన్ బాషా, షేక్ షకూరు, సయ్యద్ గౌస్ బాషా, షేక్ రహంతుల్లా పాల్గొన్నారు.


క్రీడాకారులతో కంచర్ల రామయ్య

క్రీడాకారులకు దుస్తులు పంపిణి

ప్రజాశక్తి-కందుకూరు :ఉమ్మడి ప్రకాశం జిల్లా స్త్రీ, పురుషుల బాస్కెట్‌బాల్ జట్లకు కందుకూరు ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల రామయ్య సుమారు రూ. 10 వేల విలువగల క్రీడా దుస్తులను క్రీడాకారులకు గురువారం పంపిణీ చేశారు.కంచర్ల రామయ్య మాట్లాడుతూ బాగా ఆడి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచిం చారు. ఈ జట్లు తూర్పు గోదావరి జిల్లా మార్టేరు లో జరుగు తొమ్మిదో రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ ఛాంపి యన్‌షిప్‌లో పాల్గొం టాయి. ఈ పోటీలు నేటి నుంచి అక్టోబర్ 2 వరకు జరుగుతాయి. బిస్కెట్ బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎస్ సురేష్ ,సెక్రెటరీ టి సుబ్బారావు పాల్గొన్నారు.

విరాళం అందజేత

ప్రజాశక్తి-కందుకూరు : పట్టణ గ్రామ దేవత అంకమ్మ తల్లి దేవాలయం పున: నిర్మాణంలో భాగంగా కందుకూరుకు చెందిన పరిమి తిరుపతమ్మ వారి కుమారులు నాగేంద్రబాబు, రఘురామ్ రూ 31,116 నగదును ఆలయ ప్రాంగణంలో పునర్నిర్మాణ కమిటీ సభ్యులకు అందజేశారు.ఆలయ కమిటీ సభ్యులు ఎనిమిరెడ్డి వెంకటరెడ్డి, ఆవుల మాధవరావు,మాల్యాద్రి పాల్గొన్నారు.

వినాయక నిమజ్జనం

ప్రజాశక్తి-కందుకూరు :కందుకూరు పట్టణం ఒకటో వార్డు జనార్ధన్ కాలనీలో వినాయక నిమజ్జనం సందర్భంగా కందుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛారింజ ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, పట్టణ ఎస్సి సెల్ అధ్యక్షుడు పులి నాగరాజు, పట్టణ బిసి సెల్ అధ్యక్షుడు ముచ్చు వేణు, నాయకులు వడ్డెళ్ళ రవిచంద్ర, స్థానిక నాయకులు చేవూరి చంద్రయ్య, మానికల సీతారామయ్య, ఏలూరి సంజీవరావు, ఏలూరి నాగేంద్రబాబు కత్తి శీను, షేక్ మమ్ముషా, శ్రీమన్నారాయణ, మహిళా నాయకులు చేవూరి రమణమ్మ, ఏలూరు పద్మ, పొట్లూరి భవాని పాల్గొన్నారు.

అక్టోబర్2 నుంచి సిపిఎం పాదయాత్రలు


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-కావలి రూరల్

జిల్లా సమగ్ర అభివద్ధి సాధనకు సిపిఎం ఆధ్వర్యంలో అక్టోబర్ రెండవ తేదీ నుంచి రామాయపట్నం పోర్టు నుంచి ఈ పాదయాత్ర ప్రారంభించడం జరుగుతుందని సిపిఎం నాయకులు పేర్కొన్నారు. ఈ యాత్రను సిపిఎం రాష్ట్ర నాయకులు ప్రారంభిస్తారని అందుకు సంబంధించిన రూట్ మ్యాప్ కరపత్రాలను గురువారం సిపిఎం ఆఫీసులో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎన్నికల వాగ్దానాలు అమలు చేయకుండా కొత్త పరిశ్రమలు స్థాపించకుండా ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరణ చేస్తూ నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో విఫలమైందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు మూసివేయడంతో లక్షల మంది కార్మికులు వీధిన పడ్డారన్నారు. దీనివలన నిరుద్యోగం పెరిగిందన్నార. బిజెపి కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 9 సంవత్సరాల పాలనలో ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెంచి ప్రజలపై భారాల మోపిందని తీవ్రంగా విమర్శించారు. ఈ పాదయాత్రలను అక్టోబర్ రెండున ప్రారంభించి ఉలవపాడు, గుడ్లూరు, కందుకూరు, వలేటివారిపాలెం, లింగసముద్రం, కొండాపురం, కలిగిరి ,జలదంకి, మండలాల మీదుగా వచ్చేనెల 9వ తేదీ కావలికి చేరుతుందని తెలిపారు. కావలి నుండి మరికొన్ని మండలాల మీదుగా వచ్చే నెల 13వ తేదీ నెల్లూరులో జరిగే బహిరంగ సభతో ముగిస్తుందని తెలిపారు.కార్యక్రమంలో సిపిఎం నాయకులు వెంకయ్య, పి.తిరుపాలు, వై.కష్ణమోహన్, పి.పెంచల నరసింహం, కృష్ణయ్య, పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఉదయగిరి

జిల్లా సమగ్రాభివద్ధి సాధనకు సిపిఎం పాదయాత్రను ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని రైతు సంఘ నాయకులు కోరారు. గురువారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 3 నుంచి 13వ తేదీ వరకు సిపిఎం చేపట్టే బండగానిపల్లి నుండి ఉదయగిరి వరకు ఫుట్ రోడ్ నిర్మించాలి.పాదయాత్రను అన్ని ప్రజా సంఘాలు మేధావులు, నిరుద్యోగులు, గ్రామాల ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.


మాట్లాడుతున్న కాకు వెంకటయ్య

గుర్రం జాషువాకు నివాళులు:జెవివి

ప్రజాశక్తి-కావలి.

జనవిజ్ఞాన వేదిక ,కావలి పట్టణ శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ రవి నర్సింగ్ హోం లో గురువారం " గుర్రం జాషువా 128వ జయంతి"సందర్భంగా గుర్రం జాషువా, ఎం ఎస్ స్వామి నాధన్, భగత్ సింగ్‌లకు ఘనంగా నివాళులర్పించారు. వేదిక అధ్యక్షులు తోట వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో . జాషువాతన ప్రముఖ ' గబ్బిలం' ఖండకావ్యం ద్వారా కవిత్వాన్ని సామాజికబాట పట్టించి, దళిత బహుజనులు సామాజికంగా పడుతున్న అణచివేతను దారుణమైన వేధింపులు, అవమానాలను కళ్ళకు కట్టినట్లు చూపించి, కన్నీరు తెప్పించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు రవికుమార్, సెక్రటరీ హరనాథ్, ట్రెజరర్, సి. శారద, సుబ్బరాయశర్మ, సభ్యులు హరినారపరెడ్డి, మురళీకష్ణ, తిరుమల, జానకిరామ్, ప్రసాదరావు, జాన్, హజరత్తయ్య, రమణయ్య , ప్రభాకర్, కత్తి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


నివాళులర్పిసుప్తున్న జెవివి నాయకులు

నిరసన దీక్ష విజయవంతం చేయండి

మాజీ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

చేజర్ల మండలంలోని చేజర్ల గ్రామంలో మాజీ ముఖ్యమంత్రి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్ట్‌కు నిరసనగా శుక్రవారం జరగనున్న రిలే నిరాహార దీక్షను విజయవంతం చేయాలని మాజీ మంత్రివర్యులు వెంకటగిరి శాసనసభ్యులు ఆనం రామనారాయణ రెడ్డి కోరారు. ఈ సందర్భంగా రిలే నిరాహార దీక్ష నిర్వహించనున్న చేజర్ల లోని రామాలయం సమీపాన స్థల ప్రాంగణాన్ని గురువారం సాయంత్రం ఆయన పరిశీలించారు. అనంతరం మండల తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు రావి పెంచల రెడ్డి, నివాసంలో నాయకులు కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడును అక్రమ అరెస్టు నిరసనగా చేపడుతున్న పోరాటంలో టిడిపి నాయకులు, అభిమానులు, కార్యకర్తలతో పాటు జనసేన, సిపిఐ, సిపిఎం, నాయకులు, కార్యకర్తలను కూడా కలుపుకుపోయే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా స్థాయి నుండి తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీ, సిపిఎం, సిపిఐ నాయకులు నిరసన కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు రావి లక్ష్మి నర్సారెడ్డి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వేలూరు కేశవ చౌదరి, మోదేపల్లి నవ కష్ణ చౌదరి, అచ్చాల నారాయణరెడ్డి, చీర్ల వెంకటేశ్వర్లు, మోదేపల్లి పెంచల నాయుడు, షేక్ మస్తాన్, గుత్తా హజరత్ నాయుడు, ఉడతా పెద్ద హజరత్తయ్య, ఆరెద్దుల రామకష్ణ, నారాయణరెడ్డి, సోమవరపు హజరత్తయ్య, జనసేన నాయకులు ఇతర పార్టీ నాయకులు పాల్గొన్నారు.


ఎంఎల్ఎ ఆనం రామనారాయణరెడ్డి


నినాదాలు చేస్తున్న నాయకులు

కొనసాగుతున్న టిడిపి దీక్షలు

ప్రజాశక్తి-కావలి

చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా, కావలి నియోజకవర్గ టిడిపి కార్యాలయం వద్ద నియోజకవర్గ స్థాయిలోని గౌడసంఘం నేతలు, టిడిపి కుటుంబ సభ్యులతో గురువారం 15వ రోజు రిలే నిరాహార దీక్షలు ఇన్‌ఛార్జ్ మాలేపాటి సుబ్బానాయుడు ఆధ్వర్యంలో జరిగాయి.దీక్షలో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో గౌడ సంఘాలకు జరుగుతున్న అన్యాయాలపై తమ గళం వినిపించారు. ప్రస్తుత వైసీపీ ప్రభుత్వంలో తమకు ఒరిగిందేమీ లేదని, అన్ని విధాలా అంధకారంలోకి నెట్టిన ఏకైక ప్రభుత్వం ఈవైసీపీ ప్రభుత్వమని ధ్వజమెత్తారు.కార్యక్రమంలో గౌడ సంఘ నేతలు ఉప్పాల శ్రీనివాసులు, కోసూరు వెంకటేశ్వర్లు, నాసిన జాలరావు, బోడుగు వెంకయ్య, తుల్లూరు మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జైలు నుండి త్వరగా విడుదల కావాలని పట్టణంలోని సుల్తాన్ షాహిద్ దర్గాలో ముస్లిం , హిందూ , క్రిస్టియన్, టిడిపి శ్రేణులు ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు.కార్యక్రమంలో ఆత్మకూరు టిడిపి పట్టణ అధ్యక్షులు తుమ్మల చంద్రారెడ్డి , సూరా భాస్కర్ రెడ్డి , గౌస్ బాషా , పులిమి శైలజా రెడ్డి, చంద్ర వెంకటసుబ్బ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కలిగిరి

తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ మాజీ ఎమ్మెల్యే టీడీపీ ఇన్‌ఛార్జీ బొల్లినేని వెంకట రామారావు ఆదేశాల మేరకు కలిగిరి క్యాంప్ కార్యాలయం వద్ద వరికుంటపాడు మండలం, టీడీపీ నేతలు ఆధ్వర్యంలో దీక్ష కార్యక్రమం చేపట్టారు.

ఈ సందర్భంగా నియోజకవర్గ పరిశీలకులు వికాస్ హరికష్ణ మాట్లాడుతూ జగన్‌ను మళ్లీ నమ్మితే రాష్ట్రాన్ని సర్వనాశనం చేస్తారని.. వైకాపా బారి నుంచి ఏపీని విముక్తి చేసేందుకు జగన్‌ను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో పోకా మహేష్, చంద్ర వెంకయ్య, గంగవరపు వేంకటేశ్వరరావు, పావుల్లూరి రవీంద్ర బాబు, ముజ్జే లక్ష్మీ నారాయణ, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-సంగం:స్థానిక ఎంపిడిఒ కార్యాలయం లో ఎంపిపి పద్మావతమ్మ అధ్యక్షతన ఎంపీడీఓ గోపి సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో జెడ్పీటీసీ రావుల లక్ష్మి, సర్పంచ్ లు,ఎంపిటిసి లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మండలంలో జరిగిన అభివద్ధి పై అధికారులు శాఖల వారీగా వివరించారు.పలువురు సర్పంచ్ లు, ఎంపిటిసి లు తమ గ్రామ పరిధిలోని సమస్యల గురించి అధికారుల దష్టికి తీసుకెళ్లారు.సమస్యలను పరిష్కరించే దిశగా కషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ నాగరాజు,వైసీపీ నాయకులు రఘునాథ్ రెడ్డి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-కావలి:సంయుక్తసేవాసంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని రవి నర్సింగ్ హోంలో తుపాన్ నగర్ కు చెందిన నిరుపేద మహిళ షేక్ షబానా నాలుగేళ్ల కుమారుడు షేక్.తాహీర్ హుస్సేన్ కి హైడ్రోసెల్ ఆపరేషన్ నిమిత్తం గురువారం సంయుక్త సేవాసంస్థ సభ్యుల సహకారంతో సంస్థ గౌరవ అధ్యక్షులు డాక్టర్ బెజవాడ రవి కుమార్ రూ.10 వేలు అందజేశారు. సహాయం అందజేసిన సంయుక్త సేవా సంస్థ సభ్యులకు రుణపడి ఉటానని బాధితురాలు తెలిపారు.





సుజాతమ్మకు మాతృవియోగం

ప్రజాశక్తి-కోవూరు: అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఏలూరు సుజాతమ్మ తల్లి ఇందిరమ్మ బుధవారం తన స్వగ్రామైన లేగుంట పాడులో అనారోగ్యంతో బాధపడుతూ తుది శ్వాస విడిచారు. ఆమె భౌతిక కాయానికి సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.మోహన్ రావు, కటారి అజయ్ కుమార్, గండవరపు శేషయ్య, పెంచల నరసయ్య, ఎస్‌కె బాబు, చాన్ బాషా, రమేష్, హరి, నివాళులర్పించారు. ఆమె కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.


నివాళులర్పిస్తున్న నాయకులు

గొప్ప దేశ భక్తుడు భగత్ సింగ్

ప్రజాశక్తి-కావలి.:డాక్టర్ రామ్ సెంటర్ విశ్వోదయ ఆధ్వర్య ంలో స్వాతంత్ర్య సమర యోధుడు భగత్ సింగ్ జయంతి సందర్భంగా గురువారం ఉదయగిరి రోడ్డులోని భగత్ సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసిఘనంగా నివాళు లర్పించారు. కార్యక్రమంలో జలదంకి ఎంఇఒ శ్రీధర్, డాక్టర్ రామ్ సెంటర్ చైర్మన్ మనోహర్‌రెడ్డి, డైరెక్టర్ తాతిరెడ్డి , సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి పాల్గొని నివాళులుఅర్పించారు.

భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు

ప్రజాశక్తి-ఉదయగిరి: మిలాద్- ఉన్- నబి వేడుకలను మండలం లోని ముస్లిం సోదరులు గురువారం భక్తిశ్రద్ధలతో జరుపుకు న్నారు. ఈ సందర్భంగా పలు మసీ దు లలో మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రవక్తలు దైవ సందేశాన్ని చదివి వినిపించారు.పండుగ పర్వదిన సందర్భంగా అందరికీ జిలేబిలు, మిఠాయిలు పంచిపెట్టారు.


కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న దృశ్యం

కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ

ప్రజాశక్తి-ఉదయగిరి: భవ్యశ్రీని కొంతమంది ఆకతాయిలు రేప్ ఘటనపై వడ్డెర సంఘ తరపున నిరసన ర్యాలీ తెలిపారు. గురువారం మండల పరిధిలోని కుర్రపల్లి బీసీ కాలనీ లో చిత్తూరు జిల్లా పెనమలూరు మండలం వేణుగోపాలపురం గ్రామంలో ఇటీవల ఈ సందర్భంగా భవ్య శ్రీ కి ఆత్మ చేకూరాలని కొవ్వొత్తులు వెలిగించి అశ్రునివాళి అర్పించారు. ఈ సందర్భంగా వడ్డెర వత్తి దారుల సంఘం నాయకులు బత్తల నాగరాజు మాట్లాడుతూ భవ్య శ్రీ మరణానికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తిరుపతి చిన్న రమణయ్య, తిరుపతి రాజా, దేవండ్ల ఏడుకొండలు,దేవండ్ల వెంకటరత్నం, తిరుపతి అంకమ్మ, దేవండ్ల కుమారి, తుమ్మి ఎట్టి వెంకటరత్నమ్మ పాల్గొన్నారు.

సుల్తాన్ షాహిద్ దర్గాలో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్: మిలాద్ ఉన్ నబి పర్వదిన సందర్భంగా పట్టణంలోని బిఎస్ఆర్ సెంటర్‌లో వెలసి ఉన్న సుల్తాన్ షాహిద్ దర్గా లో టిడిపి శ్రేణులు ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు శ్రీ నారా చంద్రబాబు నాయుడుని అక్రమంగా అరెస్టు చేయడం అన్యాయమన్నారు. ఆయన త్వరగా బయటికి కడిగిన ముత్యంలా రావాలన్నారు. కార్యక్రమంలో తుమ్మల చంద్రా రెడ్డి, సూరా భాస్కర్ రెడ్డి , షేక్ గౌస్ బాషా , చంద్రా వెంకటసుబ్బ నాయుడు , సుంకర పెంచలయ్య చౌదరి , కేత విజయభాస్కర్ రెడ్డి, పిడికిటి వెంకటేశ్వర్లు నాయుడు, తోడేటి వెంకటయ్య పాల్గొన్నారు.

పాటల పోటీని విజయవంతం చేయండి

ప్రజాశక్తి-కావలి: కావలి ఎల్డర్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో 'అక్టోబరు 1 'వ తేదీ "ప్రపంచ వద్దుల దినోత్సవం"ను పురస్కరిం చుకుని కావలి ఎల్డర్స్ క్లబ్, వాయునందన ప్రెస్ రోడ్డులోని క్లబ్ కార్యాలయమైన ' శ్రీనివాస కల్యాణమండపంలో ఉదయం 9 గంటలకు సాహిత్య ప్రాముఖ్యంగల పాటలపోటీ 55 సంవత్సరాలున్న మహిళలు, పురుషులకు జరుగుతుందని ఎల్డర్స్ క్లబ్ అధ్యక్షులు జె బి ఎం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు.1వ తేదీ 9 గంటలకు శ్రీనివాస కల్యాణ మండ పానికి వచ్చి గాయనీ గాయకులు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

బూదవాడలో రచ్చబండ

ప్రజాశక్తి-మర్రిపాడు: ఉదయగిరి జిల్లా సాధన కమిటీ మండలం బూద వాడలో రచ్చబండ కార్యక్రమంను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఉదయగిరి జిల్లా సాధన కమిటీ అధ్యక్షులు డాక్టర్ కె. వేణుగోపాల్ పాల్గొని మాట్లాడారు. అధికార వికేంద్రీకరణ ద్వారా అభివద్ధి సాధ్యమని రాష్ట్ర ముఖ్యమంత్రి 26 జిల్లాలను ఏర్పాటు చేశారన్నారు. చిన్న జిల్లాల ద్వారా అభివద్ధి జరుగుతుందని ఉదయగిరి ప్రాంతం ఏ జిల్లా కేంద్రానికైనా 150 కిలోమీటర్ల దూరంలో ఉందన్నారు. కాబట్టి ఏ సమస్య పరిష్కారానికి వెళ్లాలన్నాప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇతర ప్రాంతాల్లో ఉన్నప్రజల జీవనస్థితిగతులతో మన ప్రాంతంలో ఉన్న ప్రజల జీవితాలను పోల్చుకుంటే మనం ఎంతో వెనుకబడి అధ్వానపు జీవితాన్ని గడుపుతున్నామన్నారు.కార్యక్రమంలో ఉదయగిరి జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి షేక్ దస్తగిరి అహ్మద్, గ్రామ సర్పచ్ హరిబాబు, గ్రామ వైద్యులు శ్రీరాములు, రబ్బాని దాదా, మురళి, మహిళలు పాల్గొన్నారు.



రక్తదానం గొప్పది

ప్రజాశక్తి-కావలి:స్వచ్ఛంద రక్తదానం కుల మతాలకు అతీతమైన సేవాకార్యక్రమం అని వాయిస్ అఫ్ ముస్లిం మైనారిటీ సంస్థ అధ్యక్షులు మొగల్ సలీం బేగ్ పేర్కొన్నారు. మిలాద్ ఉన్ నబీ (మహమ్మద్ ప్రవక్త జన్మదినం) సందర్భంగా స్థానిక తుపాన్ నగర్‌లోని సుల్తానే మదీనా మస్జీద్ లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సలీం మాట్లాడుతూ, కోవిడ్ -19 ప్రభావం ఎక్కువై రక్తకొరత ఏర్పడిన పరిస్థితులలో 2021 సంవత్సరంలో, తుపాన్ నగర్ మస్జీద్ లో ప్రవక్త జన్మదిన సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించామని, అప్పటి నుండి ఆ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. ఈ శిబిరంలో 30 మంది రక్తదానం చేశారు. మస్జీద్ కమిటీ సభ్యులుషేక్ ముజిబ్, వాసిమ్ అక్రమ్, షాజహాన్, దస్తగిరి, కాలేషా,వార్డ్ ఇన్‌ఛార్జి అబ్దుల్లా, గౌస్ అహ్మద్, షాలు, రషీద్, రెడ్ క్రాస్ ప్రతినిధులు నయీమ్, పద్మావతి, శేషమ్మ, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



దోషులను కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి-మర్రిపాడు:చిత్తూరు జిల్లా వేణుగోపాలపురం గ్రామానికి చెందిన ఇంటర్మీడియట్ చదువుతున్న బాలికను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని వడ్డెర వత్తిదారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ గుంజి దయాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆయన స్థానిక సిపిఎం కార్యాలయంలో పత్రికా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వినాయక చవితి సందర్భంగా స్వామివారిని దర్శించుకుని వస్తుండగా నలుగురు యువకుల్లో ఒకరు బాలికను రహస్య ప్రదేశానికి తీసుకెళ్లి ఆపై నలుగురు అత్యాచారం చేసి గుండు చేసి, కనుబొమలు గొరిగి అతి కిరాతకంగా హత్య చేశారన్నారు. రాష్ట్రంలో వడ్డెర మహిళలు బాలికలపై అత్యాచారాలు, అఘాయిత్యాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. వడ్డెర బాలికపై జరిగిన అత్యాచారాన్ని అందరూ ముక్తకంఠంతో ఖండిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కమీషన్ వేసి రిటైర్డ్ న్యాయమూర్తిచే విచారణ జరిపించి దోషులకు ఉరిశిక్ష పడేలా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మతురాలి తల్లిదండ్రులకు రూ 50 లక్షలు ఎక్స్ గ్రేషియా చెల్లించి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలన్నారు.కార్యక్రమంలోఐద్వా మండల కార్యదర్శి శ్యామలమ్మ, వడ్డెర వత్తిదారుల సంఘం సభ్యులు, సిఐటియు మండల కార్యదర్శి రత్నయ్య, సిపిఎం సీనియర్ నాయకులు మునగాల సూర్యనారాయణ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నాయకులు

కుల చిచ్చు పెట్టొద్దు

ప్రజాశక్తి-కావలి: ప్రశాంతంగా ఉన్న కావలి నియోజకవర్గంలో కాపు కులంలో చిచ్చు రేపి, రెండు కులాల మధ్య తగాదాలు పెట్టవద్దని, కావలి ఎం ఎల్ ఏ రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి పై అవాకులు, చవాకులు పేలితే మలిశెట్టి వెంకటేశ్వర్లుకు తగిన బుద్ధి చెప్పాల్సి వస్తుందని వైసిపికి చెందిన కాపునేతలు హెచ్చరించారు. గురువారం స్థానిక వై సి పి కార్యాలయంలో వైసీపీ కి చెందిన కాపు నేతలు సాయి కుమార్, దామిశెట్టి సుధీర్ నాయుడు,తూపిరిపెంచలయ్య, బండారు మహేష్ నాయుడు, మండలి కష్ణారావు, పోలిశెట్టి శ్రీనివాసులువిలేకరుల సమావేశంలో మాట్లాడారు.టీడీపీలో బలిజలకు పదవులిచ్చారని, వైసీపీలో ఇవ్వలేదనడం సరికాదన్నారు. ఎంఎల్ఎపై బురద చల్లాలని చూస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు.


మాట్లాడుతున్న నాయకులు

కావలి-నెల్లూరు నాన్ స్టాప్ బస్సు ప్రయాణ సమయం తగ్గింపు

ప్రజాశక్తి-కావలి: కావలి-నెల్లూరుల మధ్య తిరుగుతున్న నాన్ స్టాప్ బస్సు ప్రయాణంలో మరింత సమయం ఆదా అయ్యే విధంగా చర్యలు తీసుకున్నట్లు ఎపిఎస్ ఆర్టీసీ, కావలి డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు తెలిపారు. కావలి నుంచి నెల్లూరు వెళ్లు నాన్ స్టాప్ బస్సుకు బస్టాండ్ లో టికెట్ ఇచ్చిన తరువాత, ముసునూరు చేరేలోగా ఎక్కిన ప్రయాణికులకు ముసునూరు వద్ద టికెట్ ఇచ్చే ఏర్పాట్లు ఉండేవన్నారు. అదే విధంగా నెల్లూరు నుండి కావలికి వచ్చే సమయంలో ఇనమడుగు రోడ్ వద్ద టిక్కెట్లు ఇచ్చేవారని అన్నారు. ఇందువలన కొంత సమయం వథా అయ్యేదని వివరించారు. ఇప్పుడు మధ్యలోఎక్కినప్రయాణికులకు బస్సులోనే డ్రైవర్ టికెట్ ఇచ్చే విధంగా చర్యలు తీసుకున్నామని, అందువలన ప్రయాణ సమయం ఆదా అవుతుందన్నారు. మరింత తక్కువ సమయంలో గమ్యం చేరవచ్చుని పేర్కొన్నారు.




వినతిపత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

ఆర్‌ఐ ఖాసీంకు వినతి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్: ఆత్మకూరు పురపాలక సంఘంలో రూరల్ మండలంలోని కొన్ని గ్రామ పంచాయతీలైనటువంటి వాసిలి , నువ్వురుపాడు , రావులకొల్లు , చెర్లో యడవల్లి , గ్రామాలను పురపాలకంలో విలీనం చేయుటకు పురపాలక అధికారులు ప్రతిపాదనలను సిద్ధం చేస్తున్నారు. దానికి వ్యతిరేకంగా తెలుగుదేశం పార్టీ నాయకులు వినతి పత్రం పురపాలక కమిషనర్ అందుబాటులో లేనందువలన పురపాలక మేనేజర్ ఖాసింకు వినతి పత్రం అందజేశారు.కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు తుమ్మల చంద్రారెడ్డి, రాష్ట్ర మహిళా కార్యదర్శి పులిమి శైలజా రెడ్డి, రూరల్ మండల అధ్యక్ష కార్యదర్శులు సుంకర పెంచల చౌదరి, కేత విజయభాస్కర్ రెడ్డి, తెలుగు యువత జిల్లా మాజీ ఉపాధ్యక్షులు పిడికిడి వెంకటేశ్వర్లు నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు పరిశీలన

ప్రజాశక్తి-సంగం:పోలీస్ స్టేషన్, సిఐ కార్యాలయాన్ని ఎస్‌పి తిరుమలేశ్వర్ రెడ్డి, ఎఎస్‌పి హిమవతితో కలిసి సందర్శించారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్లో రికార్డులు పరిశీలించి సిబ్బంది పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో రోడ్డు ప్రమాదాలు, కాలువలో పడి చనిపోయే వారి సంఖ్య అధికంగా ఉన్నట్లు గుర్తించామని తెలిపారు.జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని స్పష్టం చేశారు.మద్యం తాగి వాహనాలు నడిపే వారికి డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించి పదివేల రూపాయలు జరిమానా విధిసు న్నామని పేర్కొన్నారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు.రోడ్డు ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాలను బ్లాక్ స్పాట్ లుగా గుర్తించి నివారణకు చర్యలు గట్టి చేపడుతున్నామని అన్నారు.వారి వెంట ఆత్మకూరు డిఎస్‌పి కోటా రెడ్డి, సిఐ రవి నాయక్, ఎస్ఐ నాగార్జున రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేపట్టండి సారూ..

ప్రజాశక్తి-కావలి: కావలిపట్టణ ప్రధాన రహదారి నాలుగున్నర సంవత్సరాలుగా రోడ్డు అధ్వానంగా ఉంది. ఈ రోడ్డుకు మరమ్మతులు చేపడతామంటూ ఇదిగో! అదిగో!అంటూ అధికారపార్టీ నాయకులు మభ్య పెడుతూనే ఉన్నారు. రెండేళ్ల నుంచి కావలిఎం.ఎల్.ఏ.రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి ఎక్కడ మాట్లాడినా కావలి ట్రంక్ రోడ్డు అభివద్ధి గురించే చెబుతున్నారు తప్ప అది పూర్తి కావడం లేదు. అందుచేత విసిగిపోయిన ముసునూరు ఆటో నగర్ ప్రజలు బహిరంగంగా బయటపడి, ఇలా ఫ్లెక్సీ ద్వారా తమ నిరసన వ్యక్తం చేశారు. ఇక అధికార పార్టీ నేతలు, ఎం ఎల్ ఏ ఎలా ప్రతిస్పందిస్తారో చూడాల్సి ఉంది.



పందులను దూర ప్రాంతాలకు తరలించాలి

ప్రజాశక్తి-బిట్రగుంట:పందులు ఇళ్ల మధ్యన తిరిగితే అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని విశ్వనాథరావుపేట వైసిపి సీనియర్ నాయకులు గండూరి శ్రీనివాసులు పేర్కొన్నారు. బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ రామస్వామి పాలెం ,గిరిజన కాలనీలో పందుల సమస్యపై గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విశ్వనాథరావుపేట పంచాయతీలోని గిరిజన కాలనీ, ఇబ్రహీంపేట, విశ్వనాథరావుపేట, కొత్తూరు గ్రామాల్లో పందులు బెడద ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. వీటిని దూర ప్రాంతాలకు తరలించాలని తెలిపారు.